సాక్షి
నిర్మల్
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



సోయా రైతు చిత్తు
వాతావరణ మార్పుల కారణంగా సోయా పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూత దశలో పంటకు తెగుళ్లు సోకగా రైతులు సస్యరక్షణ చర్యలు, పిచికారి చేసినా ఫలితం లేకపోయింది. 8లో▸

నేడు బాసరకు పురుషోత్తమ భారతి మహాస్వామి రాక
భైంసా: బాసర సరస్వతీ ఆలయానికి శృంగేరి శివగంగశారద పీఠాధీశ్వరుడు పురుషోత్తమ భారతి మహాస్వామి మంగళవారం సాయంత్రం రానున్నట్లు ఆలయ ఈవో విజయరామారావు తెలిపారు. బుధవారం ఉదయం అమ్మవారి అభిషేక సేవలో పాల్గొంటారని పేర్కొన్నారు.

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.4 / 23.6
ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడ జల్లులు కురుస్తాయి.

బీళ్లకు గంగనీళ్లు!



గుండంపల్లి శివారులో గోదావరి వద్ద ఎత్తిపోతల పథకం



డెలివరీ సిస్టర్న్

- ఎత్తిపోయనున్న 'లక్ష్మీనర్సింహుడు'
- సిద్ధమైన 'కాళేశ్వరం' ప్యాకేజీ - 27
- 50 వేల ఎకరాలకు సాగునీరు..
- రేపు ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, ఐకేరెడ్డి
- పలు అభివృద్ధి పనుల ప్రారంభం

నిర్మల్: తలాపున గోదారి పారుతున్నా.. బీళ్లుగా మారిన భూములను చూసి దిగాలు చెందుతున్న రైతుల కల సాకారం కాబోతోంది. గంగనీళ్ల కోసం నిరీక్షిస్తున్న భూములు సస్యశ్యామలం కాబోతున్నాయి. బీడు భూముల్లో జల దృశ్యం సాక్షాత్కారం కాబోతోంది. అపర భగీరథుడిగా గుర్తింపు పొందిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా 2008లో ప్రారంభించిన పథకం ఎట్టకేలకు నీరు అందించబోతోంది. గలగల పారేటి గంగమ్మ రైతుల భూములకు మళ్లనుంది. ఏళ్లుగా ఊరిస్తున్న గోదావరి నీళ్లను దిలావర్‌పూర్ మండలం గుండపల్లి వద్ద ఎత్తిపోసేందుకు 'శ్రీలక్ష్మీ నర్సింహుడు' సిద్ధమయ్యాడు. కాళేశ్వరం పథకంలో నిర్మించిన లిఫ్ట్‌ద్వారా జిల్లాలో 50 వేల ఎకరాలకు సాగునీరు అందనుంచి. మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి బుధవారం ప్యాకేజీ-27ను ప్రారంభించనున్నారు.

2008లో మొదలై..
ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ నుంచి జిల్లాలోని ఆయకట్టుకు లిఫ్ట్ ద్వారా నీరందించేందుకు ఈ పథకం ప్రారంభించారు. వైఎస్సార్ మరణం, తర్వాత పరిణామాలతో పనులు ఆగిపోయాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రాణహిత-చేవెళ్లను కాళేశ్వరం పథకంగా పేరు మార్చి, ఈ పథకం కింద నిర్మల్ నియోజకవర్గంలో ప్యాకేజీ-27 ద్వారా 50 లక్షల ఎకరాలు, ముధోల్ నియోజకవర్గంలో ప్యాకేజీ-28 ద్వారా 50 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా మార్పులు చేశారు.

యూనిట్ - 3 ద్వారా..
యూనిట్-3గా మూడో పంప్‌హౌస్‌ను కద్తాల్ గ్రామం వద్ద సరస్వతీ కెనాల్ ద్వారా నీటిని ఎత్తిపోసేలా రూపకల్పన చేశారు. ఈ నీళ్ల మేడిపల్లి శివారులో ఎడమ కాలువ ద్వారా 17.5 కిలోమీటర్లు, కుడి కాలువ ద్వారా 1.9 కిలోమీటర్లు ప్రవహించనున్నాయి. కాల్వ లక్ష్మీనర్సింహస్వామి పేరు మీదుగా ప్రారంభమయ్యే ప్యాకేజీ-27 ఎత్తిపోతల పథకం ద్వారా మొత్తం 50 వేల ఎకరాలకు నీరందించేలా ప్లాన్ చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చొరవ, సీఎం కేసీఆర్ సహకారం ప్రస్తుతం ప్రధాన కాలువ ద్వారా నీరందించే వరకు వచ్చింది. మంత్రి కేటీఆర్ నీటి విడుదలను ప్రారంభించిన తర్వాత మరిన్ని నిధులిస్తారని, రైతుల భూముల దాకా నీరందించే డిస్ట్రిబ్యూటరీ కాలువలు పూర్తవుతాయని ఆశిస్తున్నారు.

రూ.714 కోట్లతో..
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.714 కోట్ల వ్యయంతో ప్యాకేజీ-27 చేపట్టారు. దిలావర్‌పూర్ మండలం గుండపల్లి వద్ద గోదావరిలో పంప్‌హౌస్ నిర్మించారు. ఇక్కడి నుంచి ఇదే మండలంలో మాడేగాం గుట్టవద్ద నిర్మించిన డెలివరీసిస్టర్న్ వద్దకు ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌ను ఎత్తిపోస్తారు.

ఎనిమిది మండలాలకు సాగునీరు..
ఈ డెలివరీ సిస్టం(కుండీ) నుంచి నిర్మల్‌వైపు 13.50 కి.మీ పొడవు 100 క్యూసెక్కుల సామర్థ్యంతో కుడి కాలువ, కుంటాల మండలం వైపు 29.50 కి.మీ. పొడవు 140 క్యూసెక్కుల సామర్థ్యంతో ఎడమ కాలువ నిర్మించారు. దిలావర్‌పూర్, నర్సాపూర్(జి), కుంటాల, సారంగాపూర్, నిర్మల్, లక్ష్మణచాంద, సోన్, మామడ మండలాల పరిధిలోని చెరువులు, కుంటలకు నీరందించేలా రూపకల్పన చేశారు.

యూనిట్ - 2 ద్వారా ప్రాజెక్టుల్లోకి..
ఇదే డెలివరీ సిస్టం నుంచి దోనిగాం ప్రాజెక్ట్, స్వర్ణ ప్రాజెక్టులను నింపడానికి కూడా గుట్ట కింది నుంచి టన్నెల్, కెనాల్‌ను నిర్మించారు. ఇక మాడేగాం గుట్టమీది గ్రామాలకూ నీరందించేందుకు ప్రత్యేకంగా యూనిట్-2 పంప్‌హౌస్‌ను నిర్మించారు. ఈ పంప్‌హౌస్ ద్వారా 20 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో నీరందించేందుకు 7.50 కిలోమీటర్ల పొడవున ఎడమ, 3.75 కిలోమీటర్ల పొడవున కుడి కాలువలను నిర్మించారు. రెండు కాలువల ద్వారా ఐదు వేల ఎకరాలకు నీరందించనున్నారు.

జిల్లాకు పారిశ్రామిక కళ..
వ్యవసాయాధారితమైన జిల్లాలో తొలి పరిశ్రమకు అడుగుపడింది. సోన్ మండలం ఎస్సారెస్పీ ప్రాజెక్టుకు సమీపంలోని పాతపోచంపాడ్ వద్ద ఆయిల్‌పాం ఫ్యాక్టరీ పనులకు మంత్రులు శంకుస్థాపన చేయనున్నారు. మొత్తం 40 ఎకరాల విస్తీర్ణంలో రూ.250 కోట్లతో ఈ పరిశ్రమను ప్రియునిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేస్తోంది.

ఎట్టకేలకు 'సమీకృతం'..
వెజ్, నాన్‌వెజ్, కూరగాయలు, పూలు, పండ్లు ఇలా అన్నీ ఒకేచోట దొరికేలా నిర్మల్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలో నిర్మించనున్నారు. పాత కార్యాలయాన్ని కూల్చివేసి, దాని వెనుకే ఉన్న సిపాయిల బావి ప్రాంతాన్ని కలుపుకుంటూ మొత్తం 2.30 ఎకరాల విస్తీర్ణంలో రూ.10.15కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు. ఈనిర్మాణంలో కింద 136 కూరగాయల దుకాణాలు, మొదటి అంతస్తులో 34 నాన్‌వెజ్ షాపులు, నిత్యావసరాల సరుకుల కోసం మరో 18 కమర్షియల్ షాపులు ఉండేలా నిర్మించనున్నారు.

ఇవి కూడా..
నిర్మల్ జిల్లాకేంద్రంలో రూ.23.91 కోట్లతో చేపట్టిన మిషన్‌భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ నల్లా నీటి సరఫరా మంత్రులు ప్రారంభిస్తారు. టీయూఎఫ్ఐడీసీ కింద రూ.2 కోట్లతో దోబీ ఘాట్, రూ.4 కోట్లతో మౌలిక వసతులు, రూ. 50కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అమృత్ పథకంలో తాగునీటి వ్యవస్థను మెరుగుపర్చేందుకు రూ.62.50 కోట్లతో, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.25 కోట్లతో చేపట్టే వివిధ పనులను ప్రారంభిస్తారు.

'కాళేశ్వరం'తో సస్యశ్యామలం

- జిల్లాలో 50 వేల ఎకరాలకు సాగునీరు
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- కేటీఆర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



మంత్రికి వివరిస్తున్న నీటిపారుదల శాఖ ఈఈ

దిలావర్‌పూర్: రాష్ట్రంలో సాగుభూములన్నింటికీ నీరు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు రైతాంగానికి మేలు చేస్తున్నాయని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో చేపట్టిన 27, 28 ప్యాకేజీలతో వేల ఎకరాలు సస్యశ్యామలం అవుతాయని తెలిపారు. మండలంలోని గుండంపల్లి సమీపంలోని గోదావరీ తీరంలో ఏర్పాటు చేసిన పంప్‌హౌస్, అలాగే దిలావర్‌పూర్ సమీపంలోని డెలివరీ పాయింట్‌ను మంత్రి, కలెక్టర్ సోమవారం పరిశీలించారు. ఈనెల 4న రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ 27 ప్యాకేజీ పంప్‌హౌస్‌ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో మోటార్ల పనితీరు, డెలివరీ పాయింట్లు, గ్రావిటీ నీటి ప్రవాహాన్ని మంత్రి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం 27వ ప్యాకేజీ పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు మంత్రి కేటీఆర్ చేరుకుని మోటార్లు ఆన్ చేస్తారని తెలిపారు. అనంతరం డెలివరీ పాయింట్ల వద్ద ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొన్నారు. పూజల అనంతరం పలువురు రైతులతో కేటీఆర్ మాట్లాడతారన్నారు. తర్వాత రోడ్డు మార్గంలో నిర్మల్ పట్టణానికి చేరుకుంటారని తెలిపారు. నిర్మల్ పట్టణంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని, శంకుస్థాపనలు చేస్తారని వెల్లడించారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని తెలిపా రు. మంత్రి వెంట ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ రాంకిషన్‌రెడ్డి, ఎంపీపీ పాల్దె అక్షర, పీఏసీఎస్ చైర్మన్ పీవీ.రమణారెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కె.దేవేందర్‌రెడ్డి, నాయకులు కోడె రాజేశ్వర్, ధని రవి, సప్పల రవి, కోడె నవీన్ తదితరులు ఉన్నారు.

డ్రాగన్‌ఫ్రూట్ రైతుకు అభినందన..
దిలావర్‌పూర్ మండలం గుట్ట ప్రాంతంలో రెండేళ్లుగా డ్రాగన్‌ఫ్రూట్ సాగు చేస్తున్న రైతు కదం హరిపాటిల్‌ను మంత్రి ఐకేరెడ్డి అభినందించారు. అహర్నిశలు కష్టించి పంటను సాగు చేసి ఫలాలు అందివస్తున్న తరుణంలో ఆనందంగా ఉందని రైతు తెలిపాడు. హరిపాటిల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి సూచించారు.

కేటీఆర్ సభ ఏర్పాట్లు పరిశీలన
నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కేటీఆర్ సభ ఏర్పాట్లను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. వారివెంట అదనపు కలెక్టర్ కిశోర్, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి ఉన్నారు.

గాంధీ మార్గంలో తెలంగాణ



గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: మహాత్మాగాంధీ మార్గంలో నడుస్తూ.. అహింసా పద్ధతిలో సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్‌లోని విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గాంధీజీ కలలు కన్నా గ్రామస్వరాజ్యం తెలంగాణ రాష్ట్రంలోనే అమలవుతోందన్నారు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తూ.. పరిశుభ్రతే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. విషజ్వరాలు, సీజనల్ వ్యాధులను అరికడుతున్నట్లు పేర్కొన్నారు. గాంధీ జన్మస్థలమైన గుజరాత్ రాష్ట్రంలో కూడా తెలంగాణలో ఉన్న సదుపాయాలు లేవన్నారు. ఈ గాంధీ పార్క్ ను సుందరంగా తీర్చిదిద్దడానికి రూ.75 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. వచ్చే ఆగస్టు 15 నాటికి సుందరంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. అనంతరం స్థానిక రిటైర్డ్ ఎంప్లాయిస్ భవనంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కమిషనర్ రాజు, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, దేవరకోట ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎంసీ లింగన్న, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

జాతిపిత జీవితం ఆదర్శం
నిర్మల్‌చైన్‌గేట్: జాతిపిత మహాత్మాగాంధీ జీవితం మనకు ఆదర్శమని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి నివాళులర్పించారు. సత్యం, అహింసే ఆయుధాలుగా గాంధీ భారత స్వరాజ్య సంగ్రామం సాగించి స్వాతంత్య్రం సాధించారని తెలిపారు. బాపు చూపిన మార్గంలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, జిల్లా అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం నిల్వ కష్టాలు తీర్చేలా

- గోదాముల నిర్మాణం
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- బోరిగాంలో గోదాం ప్రారంభం



గోదాంను ప్రారంభిస్తున్న మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్

లక్ష్మణచాంద: జిల్లాలో రైతుల ధాన్యం నిల్వ కష్టాలు తీర్చేలా ప్రభుత్వం గోదాములు నిర్మించిందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బోరిగాం గ్రామంలో రూ.21.37 కోట్లతో రాష్ట్ర గిడ్డంగుల శాఖ ఆధ్వర్యంలో నిర్మించిన 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదామును కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నిర్మల్ వ్యవసాయ జిల్లా అని ఇక్కడ వర్షాకాలం ఎక్కువగా వరి పంట పండుతోందన్నారు. గతంలో జిల్లాలో ధాన్యం నిల్వ చేయడానికి గోదాములు లేకపోవడంతో తూకం వేసిన తర్వాత కూడా మూడు నాలుగు రోజులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోతోందన్నారు. రైతులు కూడా పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో ఫంక్షన్ హాల్స్, ఇతర ప్రదేశాల్లో ధాన్యం నిల్వ చేశారని తెలిపారు. ఇక ఆ ఇబ్బందులు ఉండవన్నారు. గోదాము చుట్టూ సీసీ రోడ్డు నిర్మిస్తామన్నారు. సారంగాపూర్ మండలం ఆలూర్ వద్ద మరో 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గోదాము నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించామని చెప్పారు.

పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు..
మండలంలో అర్హులైన పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ద్వారా ఇచ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని మంత్రి ఐకేరెడ్డి కలెక్టర్ వరుణ్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీలతకు సూచించారు. బోరిగాంలోని ప్రభుత్వ భూమిని ఎంపిక చేసి పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన ప్రపోజల్స్ పంపాలని తెలిపారు. పాత్రికేయులు ఇళ్లు కట్టుకోవడానికి గృహలక్ష్మి పథకం కింద కూడా సహాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్, రాష్ట్ర గిడ్డంగుల రీజినల్ మేనేజర్ శ్రీహరి, వేర్‌హౌస్ కార్పొరేషన్ డీఈ రాజు, గోదాముల మేనేజర్ శివరామకృష్ణ, జెడ్పీటీసీ వోస రాజేశ్వర్, ఎంపీటీసీ గణేశ్, సర్పంచ్ మాదస్తు లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అధ్యాపకుడికి డాక్టరేట్




డాక్టరేట్ పొందిన జాదవ్ ఓం ప్రకాశ్

భైంసా: భైంసాలోని గోపాల్‌రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర అధ్యాపకునిగా పనిచేస్తున్న వాటోలి గ్రామానికి చెందిన జాదవ్ ఓం ప్రకాశ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. లక్నోలోని గ్లోకల్ విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఆచార్య రీచా బన్సర్ పర్యవేక్షణలో భారత దేశంలో ఆయా ప్రాంతాల్లో ప్యాసింజర్ కార్ల కొనుగోలు పరివర్తన అనే అంశంపై చేసిన పరిశోధనకు గ్లోకల్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. జాదవ్ ఓం ప్రకాశ్‌ను ప్రిన్సిపాల్ సుధాకర్, సిబ్బంది అభినందించారు.

నేడు అటవీ శాఖ ర్యాలీ
నిర్మల్‌టౌన్: వన్యప్రాణి సంరక్షణ ప్రణాళికలో భాగంగా జిల్లా కేంద్రంలో మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి రాంకిషన్ తెలిపారు. ర్యాలీలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



కుంటాల: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాజీరావు పటేల్ అన్నారు. కుంటాలలో 8 నుంచి 18 ఏళ్లలోపు విద్యార్థులకు సోమవారం యోగా పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై హన్మాండ్లు, ప్రిన్సిపాల్ కొత్త కాపు గంగన్న, రాకేశ్, నవీన్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే రాజ్యాధికారం



సభలో అభివాదం చేస్తున్న ముదిరాజ్ నాయకులు



పోలీస్ కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న నేతలు

- ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్
- జిల్లా కేంద్రంలో ఆత్మగౌరవ సభ
- తరలి వచ్చిన కుల బాంధవులు
- హాజరైన రాష్ట్ర నాయకులు

నిర్మల్‌టౌన్: ఐక్యతతోనే ముదిరాజ్‌లకు రాజ్యాధికారం దక్కుతుందని ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ముదిరాజ్‌ల ఆత్మగౌరవ సభ సోమవారం నిర్వహించారు. ఈ సభకు జిల్లా నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో ముదిరాజ్ కులస్తులు హాజరయ్యారు. యువత డీజే పాటలతో జై ముదిరాజ్.. జైజై ముదిరాజ్.. అంటూ నినాదాలు చేసుకుంటూ సభాస్థలికి చేరుకున్నారు. మేమెంతో -మాకంత వాటా కావాలి అని నినదించారు. సభ ప్రారంభం కాగానే తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ కిష్టన్నముదిరాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్ మాట్లాడుతూ తరాలు మారినా ముదిరాజ్‌ల తలరాత మా రడం లేదన్నారు. ఒకప్పుడు రాజ్యమేలామని, నేడు అస్తిత్వం కోసం పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కులాల దామాషా ప్రకారం 14 శాతం, 60 లక్షల ఓటర్లు ఉన్నా తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ కనీస గౌరవం ఇవ్వడం లేదని విమర్శించారు. రాజకీయంగా అణచివేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన కానిస్టేబుల్ కిష్టన్నకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు రాష్ట్రంలో అందరి కంటే ముందు ఎమ్మెల్యే టికెట్లు ప్రకటించిన కేసీఆర్ ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా ఇవ్వలేదన్నారు. ముదిరాజ్‌లను బీసీ-ఏలోకి మార్చాలని సుప్రీంకోర్టు మూడు సార్లు తీర్పు ఇచ్చినా సీఎం కేసీఆర్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండి రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. నిర్మల్ నియోజకవర్గంలో 34 వేల ఓట్లు ఉన్న ముదిరాజ్‌లు సరైన గౌరవం కల్పించిన వారికే ఓటేయాలని సూచించారు. నిర్మల్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 15 ఎకరాల స్థలం కేటాయించి, నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సభ స్థలి నుంచి మంచిర్యాల చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర సేవా సమితి అధ్యక్షుడు సురేంద్రబాబు, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, సలహాదారు భూమేష్, కామారెడ్డి కరాటే రమేశ్, సభాధ్యక్షుడు యాటకారి సాయన్న, జిల్లా కోర్ కమిటీ సభ్యుడు పాతర్ల గణేశ్, గంగాధర్, కొడుకుల గంగాధర్, సుంకర సాయి, పోతన్న, దత్తు, దాసరి శంకర్, అనిల్, కిష్టన్న, మొండే శ్రీధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రవీందర్



గాంధీ విగ్రహం వద్ద నినదిస్తున్న జర్నలిస్టులు

నిర్మల్‌చైన్‌గేట్: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరి రవీందర్, వెంకగారి భూమయ్య అన్నారు. ఐజేయూ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలు ఇచ్చిన పిలుపుమేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. అక్రిడిటేషన్ జర్నలిస్టులకు రైల్వే పాసులు పునరుద్ధరించాలని కోరారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు మనోజ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్, సభ్యులు శేషగిరి రాజు, గంగ రాజం, ఎండీ అజీజ్, రాంప్రసాద్, మహమ్మద్ ఉస్మాన్ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కడెం: మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట కూడా జర్నలిస్టులు నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రాజేశ్వరికి వినతిపత్రం ఇచ్చారు.

బాసర నుంచి శబరిమలకు పాదయాత్ర



స్వాములను పలకరిస్తున్న రామారావుపటేల్

భైంసా: అయ్యప్ప దీక్షాపరులు బాసర నుంచి శబరిమల వరకు సోమవారం మహాపాదయాత్రగా బయల్దేరారు. తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ అయ్యప్ప సేవా సమితి సభ్యులు జంగం రమేశ్ గురుస్వామి ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర ప్రారంభమైంది. మాలధరించిన స్వాములు పాదయాత్రగా వెళ్తున్నారు. 45 రోజులపాటు ఈ యాత్ర సాగుతుందని తెలిపారు. సరస్వతీ అమ్మవారిని దర్శించుకుని గోదావరి నదిలో స్నానం చేసి నిత్యహారతిఘాట్ నుంచి మహాపాదయాత్రను ప్రారంభించారు. పాదయాత్రగా వెళ్తున్న స్వాములను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామారావుపటేల్ కలిసి పండ్లు పంపిణీ చేశారు. మహాపాదయాత్రలో వెళ్లే స్వాములకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా ఉండాలని అయ్యప్పస్వామిని వేడుకున్నారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి



మంత్రి, ఎమ్మెల్సీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రావ్ కోరారు. నిజామాబాద్‌లో ఆదివారం జరిగిన బంజారా భవన్ ప్రారంభోత్సవంలో ఈ విషయమై గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందించామని తెలిపారు. తమ విన్నపానికి మంత్రి సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిషన్, సిద్దు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు నియామక పత్రాలు



నియామక పత్రాలు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

లక్ష్మణచాంద: మండలంలోని పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు ఎంపీపీ అడ్వాల పద్మ సోమవారం నియామక పత్రాలు అందించారు. గతంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా నియామకం అయిన వారిని ప్రభుత్వం ఇటీవల రెగ్యులర్ చేసింది. ఇందులో భాగంగా మండలంలో రెగ్యులర్ అయిన ఆరుగురికి నియామక పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ వోస రాజేశ్వర్, ఎంపీడీవో శేఖర్, బీఆర్ఎస్ జిల్లా కార్యదర్శి అడ్వాల రమేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అనుముల శ్రీ వైభవి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన అనుముల శ్రీవైభవి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, కిషన్ తెలిపారు. స్థానిక రవి హైస్కూల్‌లో ఆరోతరగతి చదువుతున్న విద్యార్థిని తండ్రి అనుముల అమర్ ప్రోత్సాహంతో సెప్టెంబర్ 29, 30, ఈ నెల 1న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సింగిల్స్‌లో ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకం, డబుల్స్‌లో బంగారు పతకం సాధించింది. నవంబర్ 1 నుంచి చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుంది.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పోటీలు ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో సోమవారం బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, 19 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులకు ఆసక్తి కలిగిన క్రీడలలో తగిన ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులాల ఆర్సీవో గోపిచంద్, ప్రిన్సిపాల్ విద్య, కౌన్సిలర్ పవన్ నాయక్, రుక్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన శిక్షణ



మాట్లాడుతున్న వేదపండితుడు

భైంసా(ముధోల్): బాసర ఆలయంలో ఉమ్మడి జిల్లా నూతన అర్చకులకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ధూపదీప నైవేద్యం కింద ఉమ్మడి జిల్లాలో ఎంపికైన 650 మంది అర్చకులకు శిక్షణ ఇచ్చారు. సోమవారం సేవా ఆగమం, పంచరాత్ర ఆగమంలో శిక్షణ ఇచ్చారు. బాసర ఆలయంలోని డార్మెటరీ భవనంలో శిక్షణ కొనసాగుతోంది.

12 మందిపై కేసు

కుంటాల: కుంటాలలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణకు 12 మందిని బాధ్యులుగా గుర్తించినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సోయా రైతు చిత్తు

పీఏసీఎస్‌ను ముట్టడించిన రైతులు



బోథ్ మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో విక్రయించిన సోయా విత్తనాలు రైతులు చేన్లలో విత్తారు. ఈ విత్తనాలతోనే పంటలు కుళ్లిపోయాయని రైతులు ఇటీవల కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు తమకు అవగాహన కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- తెగుళ్లతో గింజ రాక కష్టం
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- వాతావరణ మార్పులే కారణం
- ఆందోళనలో సోయా రైతులు

బోథ్: వాతావరణ మార్పుల కారణంగా జిల్లాలో సోయా పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూత దశలో పంటకు తెగుళ్లు సోకగా రైతులు సస్యరక్షణ చర్యలు, పిచికారి చేసినా ఫలితం లేకపోయింది. వేల ఎకరాల్లో సాగైన పంట తొలిసారి గింజ రాక పట్టిపోయింది. దీంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి నష్టపోయామని వాపోతున్నారు. కనీసం పంటల బీమా ఉన్నా తమకు పరిహారం వచ్చేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

విత్తనాలపైనే అనుమానం

ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే సోయా విత్తనాలను నాలుగేళ్ల నుంచి సరఫరా నిలిపివేసింది. దీంతో రైతులు మార్కెట్‌లో విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది కేడీ726 అనే రకం విత్తనాలను సొసైటీల ద్వారా కొన్నారు. ప్రైవేటు మార్కెట్‌లో సోయా, తదితర విత్తన రకాలను కొనుగోలు చేశారు. సొసైటీ ద్వారా కొన్న విత్తనాలు వేయగా పంట కుళ్లిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. పురుగుల మందులు పిచికారీ చేయడంతో పెట్టుబడులు పెరిగాయని అంటున్నారు. ప్రైవేట్ దుకాణాల్లో కొన్న విత్తనాలు బాగానే ఉన్నాయని, సొసైటీలో కొన్న విత్తనాల్లో లోపం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ, ప్రైవేట్ మార్కెట్‌లో కొన్న విత్తనాలు వేసిన పంటల్లో తెగుళ్లు సోకిందని చెబుతున్నారు. తెగుళ్లను ముందు గమనించిన వారు పిచికారి చేయడంతో పంట బాగానే ఉందని, తెగుళ్లు గుర్తించడం ఆలస్యంతో కాయ దశలో పంట కుళ్లిపోయిందని అంటున్నారు.



తెగుళ్లు సోకిన సోయా పంట

సస్యరక్షణ చర్యలు చేపట్టినా..ఫలితం శూన్యం



పంట రంగు మారినట్టు చూపిస్తున్న రైతు

జిల్లావ్యాప్తంగా వానాకాలంలో రైతులు పత్తి, తర్వాత సోయా పంటలు సాగు చేశారు. ఈ ఏడాది సోయా సాగు 1,08,522 ఎకరాలు సాగైంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందని ఆశతో పంట వేశారు. విత్తనాలు విత్తిన తర్వాత సీజన్ ఆశాజనకంగానే ఉంది. అయితే, వర్షాలు అధికంగా కురవడంతో పూతదశలో పంటకు తెగులు సోకింది. వాతావరణ మార్పులే దీనికి కారణమని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాయవచ్చే దశలో సోయా పంట రంగుమారింది. కాయదశలో తెగులు సోకి కుళ్లిపోయింది. సస్యరక్షణ చర్యలు చేపట్టినా, పురుగుల మందులు పిచికారి చేసినా ఫలితం లేకపోయిందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్‌తోపాటు పలు మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

తెగుళ్లు గుర్తించాకే పిచికారీ చేయాలి



వాతావరణ మార్పుల వల్ల సోయాకు పలు తెగుళ్లు సోకుతాయి. వాటిని గుర్తించాకే పురుగుల మందులు పిచికారి చేయాలి. ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం. పంట తెగుళ్ల బారిన పడి పాడైన తర్వాత మందులను పిచికారి చేయడంతో లాభం ఉండదు. విత్తనాల లోపమని కొందరు అంటున్నారు. వాటిని కూడా పరిశీలిస్తాం.

– వెండి విశ్వామిత్ర, వ్యవసాయాధికారి, బోథ్

8 ఎకరాల్లో తెగుళ్లు సోకాయి



బోథ్‌లోని సొసైటీలో ఒక బ్యాగ్ రూ. 2250 చొప్పున 9 బ్యాగుల కేడీఎస్ 726 సోయా విత్తన రకాన్ని కొన్నా. 8 ఎకరాల్లో సోయా వేశాను. కాయ వచ్చే దశలో పంటకు తెగుళ్లు సోకడంతో రంగు మారింది. వ్యవసాయాధికారుల సలహాతో పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. పంట మొత్తం ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఎకరాకు రూ. 20 వేల నష్ట పరిహారం అందించాలి.

– కుమ్మరి ప్రభాకర్, రైతు, కనుగట్టు, బోథ్ మండలం

సత్ప్రవర్తనతో మెలగాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

ఆదిలాబాద్‌టౌన్: జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలు గతాన్ని మర్చిపోయి సత్ప్రవర్తనతో మెలగాలని, విడుదలైన అనంతరం కుటుంబానికి, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా అదనపు సెషన్ జడ్జి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ క్షణికావేశంలో నేరస్తులుగా మారడం జరిగిందని, జైలు జీవితం అనంతరం సమాజహితం కోసం మార్పు చెందాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన ఖైదీలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్, జడ్జి దుర్గారాణి, డీఎస్పీ ఉమేందర్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, డీపీఆర్వో విష్ణువర్ధన్, న్యాయవాది గంగారాం, తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, జడ్జి

ప్రగతి భవన్‌కు ఆదివాసీల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72లో కొంతకాలంగా నివాసం ఉంటున్న ఆదివాసీలు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌కు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ సమితి జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడుతూ మావల మండలంలోని కుమురంభీం కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసీల ఇళ్లస్థలాలకు పట్టాలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర ఈ నెల 9 వరకు కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. పాదయాత్రకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్రం శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుకబాయి, ఉపాధ్యక్షులు ఉయిక ఇంద్రబాయి, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కోట్నాక్ బారిక్‌రావ్, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు శాంతాబాయి, తుడుందెబ్బ ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, మావల మండల అధ్యక్షుడు ఆత్రం గణపతి, పట్టణ అధ్యక్షుడు కుడ్మెత ప్రకాష్ పాల్గొన్నారు.

ఆస్తి కోసం తమ్ముడి హత్య

- కుమారుడితో కలిసి ఘాతుకం
- నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద(నిర్మల్): ఆస్తి కోసం తమ్ముడినే అన్న హత్య చేసిన ఘటన నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలో చోటు చేసుకుంది. గత నెల 29న నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్‌లో జరిగిన హత్య వివరాలను డీఎస్పీ గంగారెడ్డి సోమవారం వెల్లడించారు. గ్రామానికి చెందిన అన్నదమ్ములు సిలారి పెద్ద మల్లయ్య, సిలారి చిన్న మల్లయ్య(45)కు కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. తరచూ పెద్ద మల్లయ్య తన తమ్ముడు చిన్న మల్లయ్యపై దాడి చేసేవాడు. దీంతో బాధితుడు అతని అన్న, కుమారుడు మహేష్‌లపై పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు కేసు పెట్టాడు. తమ్ముడిపై కోపం పెంచుకున్న పెద్ద మల్లయ్య అతన్ని చంపితే ఇల్లు, భూమి తనకు చెందుతాయని భావించి కుమారుడు మహేష్‌తో కలిసి కుట్రపన్నాడు. గతనెల 29న ఇంటివద్ద జరిగిన గొడవను అదునుగా భావించిన తండ్రీకొడుకులు ఊరి చివరన మాటువేసి మాంసం కొట్టే కత్తి, ఇనుప రాడ్‌తో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చిన్నమల్లయ్య అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ముందుగా నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గత నెల 30న మృతి చెందాడు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మోటార్ సైకిల్, కర్ర కొడవలి, కత్తి, ఇనుప రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హత్యకేసు ఛేదించిన సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు శ్రీకాంత్, రాజు, రవీందర్‌ను ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎంలు ఒక్కటే

- అవినీతి పాలనలో కేసీఆర్‌ను మించిన వారు లేరు
- మోదీ ప్రభుత్వ సంస్థలను బఠానీల్లా అమ్మేస్తున్నారు
- రిటైర్డు ఐఏఎస్ ఆకునూరి మురళి

కైలాస్‌నగర్: జైభారత్ అంటూ ప్రధాని నరేంద్ర మోదీ, జై తెలంగాణ పేరిట సీఎం కేసీఆర్ ప్రజలను భావోద్వేగాలకు గురి చేసి ఓట్ల రాజకీయానికి పాల్పడుతున్నారని రిటైర్డు ఐఏఎస్ ఆకునూరి మురళి ఆరోపించారు. తెలంగాణలో అవినీతి, ఆర్థిక దోపిడీ, దేశంలో విద్వేష, విభజన, పేదల వ్యతిరేక రాజకీయాలను ఓడించాలంటూ జాగో తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సోమవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. మోదీ, కేసీఆర్ పాలనలో దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, ప్రభుత్వ సంస్థల నిర్వీర్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్, బీజేపీలు బయటకు శత్రువుల్లా వ్యవహరిస్తూ లోపాయికారీగా స్నేహితుల్లా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆ రెండు పార్టీలకు ఎంఐఎం సహకరిస్తుందన్నారు. ఈ మూడు పార్టీలు ఒక్కటేనని రానున్న ఎన్నికల్లో వీటిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అవినీతి పాలనలో కేసీఆర్ దేశంలోనే నంబర్ వన్ అని ఆయన్ను మించిన అవినీతిపరుడు మరేవరు లేరని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి పథకాల్లో వేల కోట్లను దోచుకున్న కేసీఆర్ రాష్ట్రంలో దోచుకొండి, దాచుకొండి అనేలా తన ఎంపీ, ఎమ్మెల్యేలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పేదలకు అవసరమైన విద్య, వైద్య రంగాలపై తొమ్మిదేళ్ల పాలనలో ఏ ఒక్కరోజు సమీక్షించని సీఎం కేసీఆర్ ఎన్నికలు వచ్చిందంటే కొత్త స్కీంలు ప్రవేశపెట్టి రాజకీయ లబ్ధికి పాల్పడుతున్నారన్నారు. రూ.28వేల కోట్లను రైతుబంధు పేరిట ఎన్ఆర్ఐలు, సినీనటులు, మంత్రులకు దోచిపెట్టారని మండిపడ్డారు. ఎంఐఎం అధినేత అసుద్దీన్ ఓవైసీ తన కుటుంబ ప్రయోజనాల కోసం యావత్ దేశంలోని ముస్లింలను బీజేపీకి తాకట్టు పెడుతున్నారన్నారు. తనకు అధికారమిస్తే రూ.15లక్షలను ప్రతీ పేదవాడి ఖాతాలో జమచేస్తానన్న మోదీ దాన్ని అమలు చేయకపోగా బడాబాబులకు సంబంధించి రూ.16లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారన్నారు. ప్రభుత్వ సంస్థలను బఠానీల్లా తన స్నేహితులైన అంబాని, అదానీలకు కట్టబెడుతున్నారన్నారు. ఈ మూడు పార్టీలను ఓడించకుంటే పేదల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుందన్నారు. సదస్సులో రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్, సైకలాజ్, డాక్టర్ పృథ్వీరాజ్, డా.వినాయక్‌రెడ్డి, సాయిరి శశికాంత్, నైనాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ఆకునూరి మురళి

ఎన్‌సీసీ దేశభక్తిని పెంపొందిస్తుంది

- లెఫ్టినెంట్ కల్నల్ వికాస్
- ఉమ్మడి జిల్లా వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం

ఆదిలాబాద్: ఎన్‌సీసీ శిక్షణ దేశభక్తిని పెంపొందిస్తుందని ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వికాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 32–టీ బెటాలియన్ ఎన్‌సీసీ జాయింట్ ఆన్వల్ ట్రైనింగ్ క్యాంపును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ ఎంతో క్రమశిక్షణ నేర్చుకునేలా చేస్తుందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, సాంస్కృతిక అంశాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు ఎన్‌సీసీ కేడేట్లు గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండర్ కెప్టెన్ జగ్ రామ్, ఎన్‌సీసీ అధికారులు ఆనంద్‌రావు, శ్రీనివాసరావు, రాజానందం, నరేందర్, వందన, స్వరాజ్ సింగ్, రవీందర్, సుబేదార్ మేజర్ ఆనంద్ కుమార్, ట్రైనింగ్ ఆఫీసర్ తేజ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ వికాస్

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

కుంటాల(ముధోల్): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంబుగామ గ్రామానికి చెందిన బాసర శంకర్ (62) తన అత్తగారి గ్రామమైన గుండాయిపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కడుపులో నొప్పి వస్తోందని, పురుగుల మందు తాగి చనిపోతానని, అమ్మను, అన్నయ్యను బాగా చూసుకోవాలని చిన్న కుమారుడు అవినాష్‌కు ఫోన్‌చేసి తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు గాలించగా.. మెదన్ పూర్ అటవీ ప్రాంతంలో మృతదేహం గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రముఖ న్యాయవాది హఠాన్మరణం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది బెజ్జంకి హన్మంతరావ్ హఠాన్మరణం చెందారు. ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఆయన 45 ఏళ్ల పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ న్యాయవాదిగా, మున్సిపల్, కుల సంఘానికి న్యాయ సలహాదారులుగా పనిచేశారు. ఐదు రోజుల క్రితం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి ఎమ్మెల్యే జోగు రామన్న, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీబీ డైరెక్టర్ బాలురి గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్‌రావు పాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జనరల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ తెలిపారు. మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన సాయినాథ్ (45)కు మలవిసర్జన ద్వారం నుంచి పెద్దపేగు బయటకు వచ్చింది. పరీక్షించిన రిమ్స్ ఆస్పత్రి వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో బంధువుల సలహా మేరకు గత నెల 25న నిర్మల్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు సిగ్మాయిడ్ మ్యుకోకుటోనియస్‌గా గుర్తించారు. 26న వైద్యులు సర్జన్ గణేశ్, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ నళిని శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేయగా సోమవారం డిశ్చార్జి చేశారు. ఆపరేషన్‌కు ప్రైవేటులో అయితే దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు అయ్యేదని, ఇక్కడ ఉచితంగా నిర్వహించామన్నారు. మెడికల్ కళాశాల అనుబంధ బోధన ఆస్పత్రిగా ఏర్పడిన తర్వాత జనరల్ ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయని, జిల్లా ప్రజలు వినియోగించుకోవాలన్నారు.



పేషెంట్‌తో ఆస్పత్రి వైద్యసిబ్బంది

కలకలం రేపిన గుర్తు తెలియని మృతదేహం

జైనథ్: మండలంలోని భోరజ్ ఎక్స్‌రోడ్ సమీపంలోని ఓ దాబా వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం దాబావద్ద సోమవారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నీలం రంగు టీషర్ట్, నలుపురంగు ప్యాంట్ ధరించాడు. ముక్కు, నుదురు, ఎడమకన్ను, ఎడమ చేతిపై గాయాలున్నాయి. పంచాయతీ కార్యదర్శి సతీష్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి లుక్‌ఔట్ నోటీలు జారీ చేసారు. మృతునికి 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుని ఒంటిపై గాయాలు కనిపించడంతో ఎవరో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

‘బీసీలకు 60 సీట్లు కేటాయించాలి’



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఆదిలాబాద్‌రూరల్: ఐదుశాతం ఉన్న రెడ్లకు 40, అరశాతం ఉన్న వెల్మలకు 12 సీట్లు కేటాయించి 60 శాతం ఉన్న బీసీలకు 23 ఎమ్మెల్యే సీట్లు కేటాయించిన బీఆర్ఎస్ పార్టీ బీసీల ద్రోహుల పార్టీనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలలో 136 కులాలు ఉంటే కేవలం ఆరు కులాలకు మాత్రమే సీఎం కేసీఆర్ 23 ఎమ్మెల్యే టికెట్లు కేటాయించి బీసీ వ్యతిరేక విధానాన్ని అవలంబించారని మండిపడ్డారు. కేటాయించిన సీట్లలో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఎమ్మెల్యే అభ్యర్థుల టిక్కెట్లు ఖరారు చేయాని కాంగ్రెస్, బీజేపీలు సైతం బీసీలకు 60 సీట్లు కేటాయించాలన్నారు. తమకు కావాల్సింది సబ్సిడీ గొర్రెలు, గేదెలు, మేకలు కాదని, రాజ్యాధికారం కావాలన్నారు. ఓబీసీనని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ బీసీలకు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు శ్యాం, విక్రం, నగేష్, సత్యనారాయణ, రవీందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.

వినాయక మండపం తొలగిస్తూ యువకుడు మృతి

సోన్: వినాయక మండపం తొలగించే క్రమంలో అదుపుతప్పి కిందపడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన న్యూవెల్మల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓజా రాకేష్ (29) సోమవారం వినాయక మండపం తొలగించే క్రమంలో పైన ఉన్న సీలింగ్ రాడ్‌పై నుంచి అదుపు తప్పి సీసీరోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.